# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## గరుఢ వాహనంపై శ్రీవారి దర్శనం

నాగలాపురం, మే 8, ప్రభాతవార్త: నాగలాపురం శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం గరుఢ వాహనంపై శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు ధర్శనమిచ్చారు. భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని నిత్యోత్సవం



శ్రీకాళహస్తి, మే 8 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి సోమవారం నిత్యోత్స వ కార్యక్రమంలో భాగంగా స్వామిఅమ్మవార్ల ఉత్స వమూర్తులను ఆలయం లోని అలంకారమండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయంలో గ్రామోత్స వాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ వికె.సాగర్‌బాబు, ఆలయాధికారులు, భక్తులుపాల్గొన్నారు.

## ఏడుకొండలవాడా....

# భద్రత లోపం ఎక్కడుంది!

### ఆనందనిలయం చిత్రీకరణపై బాధ్యులెవరు!? నిఘాభద్రత విభాగం వైఫల్యమే



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

సాక్షాత్తు కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ఆలయంలోని ఆనందనిలయం పూర్తిగా వీడియో చిత్రీకరణ చేయడం వెనుక భద్రత లోపం ఎక్కడుందనేది ఇప్పుడు అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. అన్నీ సవ్యంగా జరిగిపోతే మేమంటే మేమే గట్టిగా పనిచేసుకుంటున్నామని ప్రగల్భాలు పలికే టిటిడి నిఘాభద్రత విభాగం, సెక్యూరిటీ, పోలీసు,ఎస్‌పిఎఫ్ యంత్రాంగం ఓ భక్తుడు ఆనందనిలయాన్ని చిత్రీకరించడంలో బాధ్యులెవరనేది సంచలనం. ఈ తప్పిదంలో పూర్తిగా నిఘాభద్రత విభాగం వైఫల్యమేననే మరోసారి తేటతెల్లమవుతోంది. డిప్యూటేషన్‌పై టిటిడికి వచ్చి తమ పలుకుబడిపై హవా కొనసాగిస్తూ ఏళ్ళతరబడి తిష్టవేసుకుని ఇక్కడే కుర్చీలు మారుతుండటం....పైగా నిఘాభద్రత విభాగంలో కీలకంగా ఉన్న ఒకరిద్దరు అధికారులు నామమాత్రంగా విధులు నిర్వహించుకుంటూ పోతుండటం ఇప్పుడు ఏకంగా ఆలయ భద్రతపై అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రప్రభుత్వంలోనే కీలక మైన ఐఏఎస్,ఐపిఎస్ ఉన్నతాధికారులకంటే టిటిడిలో చిన్నపోస్టులో ఉన్న వ్యక్తికే హోదా,గౌరవం ఉంటుంది. అదీ దేవదేవుని దర్శనం వెనుక దాగివున్న రహస్యం. ఇక్కడ కొందరు అధికారులు ఏకంగా తమతమ పై అదికారులకు అడుగులకు మడుగులు ఒత్తుతుండటంతో స్థానికంగా మార్పులు చేసుకుంటున్నారు. అయితే ఆలయ భద్రత ప్రాధాన్యత దృష్ట్యా డిప్యూటేషన్‌పై వచ్చిన వారిని గడువు పూర్తయితే తిరిగి మాతృసంస్థలకు బదిలీ చేయాల్సి ఉంది. ఇక తిరుమల తిరుపతిలో భద్రత విభాగంలో కీలకమైన ఎస్‌పిఎఫ్ పోలీసులు ఆడిందే ఆటగా ఇష్టారాజ్యంగా మారింది. అలిపిరి తనిఖీ కేంద్రం నుంచి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు, చివరకు ఆలయ మహద్వారం వద్దవరకు వీరి ఆగడాలకు అడ్డేలేకపోయింది. ఇందుకు నిదర్శనంగా తాజాగా ఆదివారం రాత్రి వెంకన్న దర్శనానికి వచ్చిన సమయంలో కొందరు భక్తులు తమవెంట సెల్‌ఫోన్(పెన్‌కెమెరా అంటున్న టిటిడి భద్రత విభాగం)ను ఆలయంలోనికి తీసుకెళ్ళి ఏకంగా ఏడుకొండలవాడు ఉన్న ఆనందనిలయం నాలుగువైపులా చిత్రీకరించారంటే భద్రత వైఫల్యం ఏంటనేది అర్థమవుతుంది. అసలు సెల్‌ఫోన్‌నే వెంట తీసుకెళ్ళారా?లేక పెన్‌కెమెరాతో ఆలయంలోపలకు వచ్చారా అనేది స్పష్టంగా వెల్లడించలేకపోతున్న టిటిడి నిఘాభద్రత విభాగం అధికారుల పనితీరు మాత్రం ఎత్తిచూపుతున్న నిర్లక్ష్యంగా మారింది. తిరుమలలో విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అంటేనే కొండపై సామంతరాజుల్లా భావంగా వ్యవహరిస్తున్నారు. ఆలయంలోపల గాక ఆలయం వెలుపల కూడా భద్రత సిబ్బంది జోక్యం మితిమీరిపోయింది. ఇటీవల టిటిడి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని ఇష్టానుసారంగా నియమించుకుని భద్రత పేరుతో నామమాత్రపు విధులు చేసుకుంటూ పోతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. మొత్తంమీద ఆలయంలోపల ఆనందనిలయం చిత్రీకరణకు బాధ్యులెవరనేది మాత్రం ఒకటిరెండు రోజుల్లో తేలిపోనుంది.

### ఆలయంలోపల వీడియో తీసింది మహిళే!?:

తిరుమల ఆలయంలోపలో ఆనందనిలయం చిత్రీకరణపై కలకలం రేపిన వీడియోను ఓ మహిళ చిత్రీకరించినట్లు టిటిడి అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆలయ దృశ్యాలను సీక్రెట్ కెమెరా ద్వారా తీసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మహిళా భక్తురాలికి సంబంధించిన వివరాలను విజిలెన్స్ సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.నాలుగంచెల భద్రత ఉన్న తిరుమలలో జరిగిన ఈ ఘటనకు విజిలెన్స్ వైఫల్యమనే ప్రధాన కారణమని బిజెపి నేత భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు.

### గాలిలో దీపంలా శ్రీవారి ఆలయ భద్రత

వెంకన్న ఆలయంలో వకుళమాత అన్న ప్రసాదాల పోటు నుంచి ఆనంద నిలయాన్ని ఓ భక్తుడు చిత్రీకరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది శ్రీవారి భక్తులను ఆందోళన కలిగిస్తోందని భక్తుడు, రాయలసీమ పోరాటసమితి కన్వీనర్ పి.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు.తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ప్రతి భక్తున్ని కుణ్ణంగా తనిఖీలు చేసే విజిలెన్స్ అధికారుల కళ్లుగప్పి తనిఖీలను తప్పించుకొని ఏకంగా శ్రీవారి గర్భాలయంపై వున్న ఆనంద నిలయాన్ని ఓ భక్తుడు చరవాణితో చిత్రీకరించడం పూర్తిగా ఆలయ అధికారుల భద్రత వైఫల్యమని నవీన్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. శ్రీవారి ఆలయభద్రత విషయంలో మెతక వైఖరి విడనాడి ,నిఘావ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విహారయాత్రలో విషాదం..

### తమిళనాడు బీచ్‌లో ఇద్దరు కుప్పం యువకులు గల్లంతు ..?



బీచ్‌లో గల్లంతైన ఆశిష్, ఫైజుల్లా

కుప్పం, మే 8 ప్రభాతవార్త నలుగురు స్నేహితులు కలసి సరదాగా విహార యాత్రకు వెళ్లగా వారిలో ఇద్దరు మంది బీచ్‌లో గల్లంతయ్యారని సమా చారం. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రం వేలాంగణి బీచ్‌లో జరగ్గా గల్లంతైన యువకులు కుప్పం వాసులని తెలిసింది. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఆశిష్, ఫైజుల్లా, సంజయ్, బాబీ అనే యువకులు ఆదివారం విహారయాత్రకోసం బయలుదేరారు. వీరు తమిళనాడులోని వేలాంగణి బీచ్‌కు వెళ్లి సము ద్రంలో దిగగా ఆశిష్, ఫైజుల్లాలు నీటి ప్రవాహంలో గల్లంతైనట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమిళనాడు సిఎం స్టాలిన్‌కు ఫోన్ చేసి యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. కాగా యువకుల కుటుంబాలు కన్నీటిపర్యంతమవుతూ వేలాంగణికి బయలుదేరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



కాణిపాకంలో సంకటహార గణపతివ్రతం సందర్భంగా సోమవారం స్వర్ణరథంపై ఊరేగుతున్న వరసిద్ధి వినాయకస్వామి వారు

ప్రభతవార్త, కాణిపాకం

### విపత్తులపై అవగాహన కార్యక్రమాలను

# సద్వినియోగం చేసుకోవాలి

### -జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్,మే 8 ప్రభాతవార్త:

జాతీయ విపత్తు నిర్వాహణ బృందాలు విజయవాడ పదోవ బెటాలియన్ నిర్వహించే విపత్తులపై అవగాహన కార్యక్రమాలను యువత, ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోని అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ విపత్తుల నిర్వాహణ సంస్థ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8 నుండి మే23 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని కళాశాలలు, పాఠశాలల్లో, గ్రామాల్లో, స్థానిక సంస్థలలో వరదలు వచ్చే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలు, తుఫాన్ తరచూ ఏర్పడే ప్రాంతాలలో విపత్తు సంబవించినప్పుడు, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సి న జాగ్రత్తలతో పాటు పరిశ్రమలలో ప్రమాదాలు జరిగిన సమయంలో విపత్తు నిర్వాహణ బృందాలు రాక ముందు స్థానికంగా తీసుకోవాల్సి న జాగ్రత్త చర్యలపై సామాజిక స్పృహ, అవగాహన కల్పించుట కొరకు సదస్సు లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో, స్థానిక సంస్థలలో, కళాశాలల్లో, పాఠశాలలో యువత ఎక్కువమంది పాల్గొని విపత్తు సంబవించడానికి ముందు సంబవించిన తర్వాత తీసుకోవాల్సి న చర్యలపై తమకు తాము రక్షించుకొంటూ ఇతరులను కాపాడే దిశలో వారికి ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం జరగకుండా అందుబాటులో వస్తువులను వినియోగించి ఎలా సంరక్షించుకోవాలో అవగాహన కల్పించే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించే తేదీలు, ప్రాంతాలపై విస్తృత ప్రచారం చేయాలని, మీడియా, సంబందిత అధికారులు, వాలంటీర్లు, ఆశా వర్కర్లు, డివిజన్, మండలస్థాయి అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, ట్రాఫిక్ డియస్పీ నరసప్ప, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇదేమి పాలన? ఇదేమి బోర్డు?

### ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహణపై పట్టించుకోని అధికారులు

**ఆలయాల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణ,భక్తుల సదుపాయాల కల్పన,అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదన,సుదర్శనం, సత్వర దర్శనం, కీలక నిర్ణయాల కోసం ప్రభుత్వం నామినేట్ చేసే ధర్మకర్తల మండళ్లకు అధికారాలు కేవలం గంగడోలుగా మారింది.శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ధార్మికత భావాలు కల్గిన వ్యక్తి. ఆయన ధర్మకర్తల మండలి సర్వసభ్య సమావేశానికి నెల రోజుల క్రితం రాతమూలకంగా ఉత్తరం ఇస్తే పట్టించుకోని అధికారుల తీరు గమనిస్తే ధర్మకర్తల మండళ్ళ పాలన ఇంతేనా? అని ముక్కునవేలేసుకుంటున్నారు. మొదట్లో ధర్మకర్తల మండలి సభ్యులు హాజరయ్యేవారు.కానీ ఇటీవల కాలంలో సభ్యులు కూడా ఆలయంలో కనబడటం లేదు.కేవలం ఒకరిద్దరు సభ్యులు మాత్రమే విఐపిలు వచ్చే సమయంలో కనబడుతున్నారు.**



శ్రీకాళహస్తి,మే 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వైకాపా ప్రభుత్వం వచ్చిన మూడేళ్ళకు ధర్మకర్తల మండలి ని నియమించింది. మొదట ప్రభుత్వం ఏ కారణాల చేతనో స్థానికేతరులకు అవకాశం కల్పించింది. దాంతో వివాదం చోటు చేసుకుంది.దాంతో స్థానిక శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి స్థానికులకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో వివిధ సమీకరణలు,సమీక్షలు జరిపి ఓ ప్రధాన సామాజిక వర్గానికి అవకాశం కల్పించారు.2022 మార్చి 1 శివరాత్రి నాడు నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం చేసారు. అంజూరు తారక శ్రీనివాసులును ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా ఎంపిక చేసి ప్రమాణం చేయించారు.

**పీఠం సరే అధికారాలేక్కడ?**

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా శ్రీనివాసులు పీఠంపై కూర్చొన్నారు.చక్కటి చాంబర్‌ను ఏర్పాటు చేసుకున్నారు.ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత పురాతన ఆలయాల జీర్ణోద్ధారణకు నిర్ణయం తీసుకున్నారు.పలు ఆలయాలకు కుంభాభిషేకాలు జరిపించారు.అంతేకాక సేవలకు సంబంధించి అతిధులకు నచ్చజెప్పి విరాళాల సేకరణలో విజయం సాధించారని చెప్పవచ్చు.అయితే గత కొంత కాలంగా బోర్డు సమావేశాల నిర్వహణలో నిరాశ నిస్పృహలు చోటు చేసుకున్నాయి. మొదటి సంవత్స రం అతి కష్టం మీద మహాశివరాత్రి సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సి వచ్చింది. మరో సమీక్షకు అధికారులు, ప్రజాప్రతినిధితో నిర్వహించారు.సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిని నియమించిన తరువాత రెండు నెలలకొక మారు సమావేశాలు నిర్వహించుకునే వారు. కానీ ఆ సంప్రదాయం ఈ బోర్డుకు దక్కలేదని చెప్పవచ్చు.ప్రభుత్వం జిఓ ఇచ్చిన బోర్డు ఆదేశాలను అమలు చేయటానికి ఎందుకో అధికారులు సాహసించటం లేదు. దాంతో నిత్యం ఆలయంలో దళారులు,దందా,అవినీతి చోటు చేసుకుందనే విమర్శలు చోటు చేసుకున్నాయి.అంతేకాక బోర్డుకు తెలియకుండానే 15రోజుల కొక మారు నెలకొక మారు అంతర్గత బదిలీలు జరుగుతుంటే పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

**ఏప్రిల్ 15న రాతమూలకంగా ఇచ్చినా . . .**

మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల తరువాత చివరి రోజు ధూర్జటి కళాప్రాంగణంలో అభినందన సభ తప్ప ఆలయ పరిపాలనకు సంబంధించికానీ ప్రసన్నవరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధారణకు సంబంధించి సమావేశం కానీ, శ్రీరామనవమి నిర్వహణపై అధికారులతో సమీక్షలు జరగకపోవటం గమనించదగ్గ విషయం.ఈ నేపధ్యంలో 'ధర్మకర్తల మండలి సర్వసభ్యసమావేశం' నిర్వహించమని ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏప్రిల్ 15న ఇఓకు రాతమూలకంగా విన్నవించారు. 30అంశాలను కూడా పొందుపరచారు. కానీ ఏ కారణాల చేతనో ఇఓ సమావేశం ఏర్పాటు చేయటం లేదనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# పిడుగుపడి రైతు మృతి



మృతి చెందిన దాము

కేవీబీ పురం, మే 8 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని కోటమంగాపురం గ్రామంలో నివాసం ఉంటున్న మేరవుల దాము(54) పిడుగుపాటుకు మృతి చెందాడు. ఆయనకి భార్య శాంతి, ఇద్దరు పిల్లలు. తన సొంత గ్రామంలో భార్యభర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవారు. వరి నాటేందుకు దాము ఆదివారం మధ్యాహ్నం పొలంలో పని చేయడానికి పొలంలో పనిచేసుకుంటుండగా ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. దీంతో దాము అక్కడిక్కడే మృతి చెందాడు. దాము రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భార్య శాంతి గ్రామస్థులతో కలసి వెతికారు. పొలం వద్ద మృతి చెంది ఉండడం చూసి వెంటనే గ్రామస్థుల సహాయంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం ఆ గ్రామానికి చేరుకుని దాము భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన భరోసా కల్పించారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు నివాళులర్పించారు.

## కుశస్థలీనదిలో పెరిగిన నీటి ప్రవాహం



కుశస్థలీనదిలో చిక్కుకున్న ట్రాక్టర్

నగరి, మే 8 ప్రభాతవార్త:

ఇటీవల కురిసిన వర్షా లకు కృష్ణాపురంలోని అమ్మపల్లి డ్యాం నిండి గేట్లు తెరవడంతో సోమవారం ఉదయం నుంచే నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఇసుక, రాళ్లు గడ్డితో కనిపించే కుశస్థలీనది నీటి ప్రవాహంతో కళకళలాడింది. తెరని సమీపం ఇసుక తీసుకురావడానికి నదిలోకి దిగిన ట్రాక్టర్ నది నీటిలో చిక్కుకుంది. నీటి ప్రవాహం తగ్గేంత వరకు వాహనాన్ని బయటకు తీసే వీలు లేకపోవడంతో వాహనాన్ని నీటిలోనే వది డ్రైవర్లు గట్టుకు చేరుకున్నారు.

# పేరు గొప్ప ఊరు దిబ్బ

### ఇది ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుచానూరు పరిస్థితి

**తిరుమల తరువాత అంత ప్రసిద్ధి గాంచిన తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు కొలువైన ప్రముఖ పుణ్య క్షేత్రం. గతంలో తిరుమల శ్రీ వారి బ్రహ్మోత్సవాలు కూడా తిరుచానూరులోనే జరిపిన ఘనత చరిత్ర కలిగిన ప్రదేశం. దానికి తోడు జిల్లా కలెక్టరేట్‌కూడా తిరుచానూరు వద్ద ఏర్పడటం మరో ప్రత్యేకత. అంతే కాకుండా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయ వనరులు కలిగిన మేజర్ పంచాయితీ. తిరుచానూరుకు అనుసంధానంగా ప్రముఖ స్టార్ హోటల్స్, శిల్పారామం, మార్కెట్ యార్డ్, 150 బైపాస్ రోడ్డు, ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు తయారై యింది తిరుచానూరు పరిస్థితి.**





రోడ్డు పైన మురికి నీరు

తిరుచానూరు, మే 8, ప్రభాతవార్త

తిరుచానూరు నిత్యం వేలాది మంది భక్తులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. మరో పక్కన జిల్లా నలుమూలల నుండి ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారు. అయితే అందుకు అనుగుణంగా కానీస సౌకర్యాలు కల్పించడంలో అటు టిటిడి గానీ, ఇటు పంచాయితీ గానీ పట్టించుకున్న పాపాన పోలేదనడంలో అతిశయోక్తి లేదు. తాజాగా గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి ఫ్లై ఓవర్ వద్ద పంచాయితీ కార్యాలయం వద్ద రోడ్లపై నీరు నిలిచిపోవడంతో చెరువును తలపిస్తున్నాయి. కొన్ని చోట్ల మురికి కాలువలను, ఫుత్ పాత్‌లు ఆక్రమించి షాపులు పెట్టుకోవడంతో మురికి మొత్తం రోడ్లపైనే పేరుకుపోయింది. దీంతో భక్తులు, గ్రామస్తులు అవస్తలు పడుతూ నరకం అనుభవిస్తున్నారు. పద్ధతి ప్రకారం రోడ్లు, కాలువలు, ఏర్పాటు చేయకపోవడంతో ఊరంతా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. దేశ వ్యాప్తంగా కోట్లాది రూపాయిలతో అనేక దేవాలయాలు, కళ్యాణ మండపాలు నిర్మిస్తున్న టిటిడి అధికారులు గానీ, కోట్లాది రూపాయలు ఆదాయం కలిగిన పంచాయితీ గానీ, మా ప్రభుత్వంలోనే అంతా అభివృద్ధి జరిగిందని చెప్పుకునే రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదన్నది అక్షర సత్యం. గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమనే గాంధీజీ మాటలు స్పూర్తిగా తీసుకుని మారుమూల ప్రాంతాల్లో ఆదర్శ పంచాయితీ అవార్డులు అందుకుంటుంటే, తిరుచానూరు మాత్రం ఎందుకు అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిత్యం ప్రజలు అనేక రకాల సమస్యలు, ఇబ్బందులు పడుతున్నట్లు, పలు పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పంచా యితీకి భక్తుల వాహనాల పార్కింగ్ వసూలు ద్వారా కోట్లాది రూపాయిలు ఆదాయం వస్తుంది. కానీ పార్కింగ్ రోడ్లపైనే, ఇదేమని ప్రశ్నించిన వారికి పిడి గుద్దులు తప్పవు. ప్రక్కనే అనువైన ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలు మెండుగా ఉన్నప్పటికి పట్టించుకోక పోవడంతో కబ్జాకు గురి అవుతు న్నాయి. భక్తులకు కనీస సౌకర్యాలు,సరైన రోడ్లు, ముఖ ధ్వారం, బస్ స్టాండ్ లేదు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఫుట్ పాత్ వద్ద సుచి, శుభ్రత లేక ముక్కు మూసుకుని రోడ్డుపైనే నిలబడే పరిస్థితి. నిలబడేందుకు ఫుట్ పాత్ కుడా లేదు. దానిని కూడా కబ్జా చేస్తున్నారంటే, చెప్పుకుంటే సిగ్గు చేటు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు స్పందించి అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాల్లో బస్ స్టాండ్, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ఫ్లై ఓవర్ వద్ద రోడ్డును, ముఖ ద్వారంను ఏర్పాటు చేసి భక్తులు నిలబడేందుకు ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించి పచ్చదనంతో సుందరీకరించాలని పలువురుగ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.



# నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, మే 8 ప్రభాతవార్త

విద్యార్థులు విద్యతో పాటు వృత్తి నైపుణ్య అంశాలపై మక్కువ చూపాలని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్.పేట పాఠశాలలో గ్రంథాలయ శాఖచే ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈసం దర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే కష్టపడి చదవాలని తద్వారా ఉన్నత లక్ష్యాలు అధిరోహించవచ్చని సూచించారు. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. కాగా వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు కథలు, ఆటల పోటీలు, కవితలు, యోగా, క్విజ్, చిత్రలేఖనం తది తర అంశాల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి సత్యవాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అశ్విని మురుగేష్, హెచ్ఎం సుబ్బరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీ మృతి

యర్రావారిపాలెం,మే 8 ప్రభాతవార్త

మండల పరిదిలోని నెరబైలు పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన ఎన్.శ్రీనివాసులు(30) సోమవారం ఉపాధి హామీ పథకం పనుల చేస్తూ మృతి చెందాడు. ఇతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉపాధి హామీపనులు జరుగుతున్న చోట కనీస వసతులు కల్పించలేదు. కుటుంబ పెద్ద దిక్కును పోగొట్టుకున్న ఆకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం ఇద్దరు.. యువకులు అరెస్ట్

పెద్దపంజాణి మే 8 ప్రభాతవార్త :

మండలంలోని రాజుపల్లె చెక్‌పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తూ ఇద్దరు యువకులు పట్టుబడినట్లు ఎస్ఐ టి.శ్రీనివాసులు తెలిపారు.ద్విచక్రవాహనంలో శివరాజ్,వినోద్ అనే యువకులు 196 టెట్రా మద్యం పాకెట్లను తరలిస్తుండగా పోలీసు సిబ్బంది తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు.వీరి వద్దనుండి మద్యాన్ని,ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి పుంగనూరు కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

## రుణాలు తీసుకున్నవారు స్వచ్ఛందంగా వచ్చి చెల్లించండి

-ఖాతాదారులకు టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి సూచన

తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 8 ప్రభాతవార్త:



టౌన్ బ్యాంక్ నందు తీసుకున్న రుణాలకు సంబంధించి గడువు పూర్తయినా,రుణాలు చెల్లించకుండా ఉన్న బకాయిదారులు ఈనెల 30 లోపు చెల్లించాలని,లేని పక్షంలో తనఖా పెట్టిన బంగారు,ఆస్తి పత్రాలను వేలం వేసి తమ నగదు జమ చేసుకుంటామని తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు.సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మట్లాడుతూ 2022 జూలై 26న తమ పాలకవర్గం ఎన్నిక కాబడిన నాటికి బ్యాంక్ గ్రాస్ ఎన్‌పిఎ 23.69 శాతం ఉందన్నారు.మేము వచ్చిన తరువాత 9 నెలల్లో 10 శాతం తగ్గించి 12.33 శాతానికి చేర్చామన్నారు.ఓవర్ డ్యూస్ 56 కోట్ల రూ॥లు ఉంటే అందులో 30 కోట్లు,అలాగే మొండి బాకాయిలు 5 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు.పార్టీలకు,కుల మతాలకు అతీతంగా తమ పాలకవర్గం అంతా కలిసి సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ ఫలితం సాధించామన్నారు.బకాయిలు ఉన్న వారి ఇంటి వద్దకు బ్యాంకు అధికారులు వస్తారని,వారికి సహకరించి రుణాలు చెల్లించాలన్నారు.తమ బ్యాంకులో ఇతర బ్యాంకుల కంటే వడ్డీ రేటు తక్కువని,టూ వీలర్,త్రీ వీలర్,ఫోర్ వీలర్‌లకు,అలాగే కొనుగోలు గృహాలకు,నిర్మాణ గృహాలకు సైతం రుణాలు ఇవ్వబోతున్నామన్నారు.ఈ అవకాశాన్ని ఖాతాదారులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈనెల 30 లోపు స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా జీకార్ స్ట్రీట్ నందు టౌన్ బ్యాంక్ ఏటిఎం ప్రారంభిస్తామన్నారు.శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా 12వ తేదీ టౌన్ బ్యాంక్ తరపున అమ్మవారికి సారె సమర్పించబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు యాదవ్,డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి,సురేష్‌రెడ్డి,దొరబాబు,అనిల్ రాయల్,ఖాసింబాయ్,జ్యోతి ప్రకాష్,అమర్నాధ్‌రెడ్డి, వెంకటేష్ రాయల్,ఆగం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**నగరి, మే 8 ప్రభాతవార్త:** ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీదేవి సోమవారం తెలిపారు. వినాకా సంస్థ అధినేత బి.యాదగిరి ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏటా నగరిలో ఉచిత శిక్షణ అందజేస్తున్నారని తెలిపారు. ఈ నెల 13 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఎస్‌జీఎన్(జీహెచ్ఎస్) నగరి బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందన్నారు. బ్యాంకింగ్, బృంద చర్చలు, సివిల్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, రైల్వే, స్టాఫ్ సెలెక్షన్ కమీషన్ పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అందులో భాగంగా మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం, స్టడీ మెటీరియల్ కల్పిస్తున్నారని తెలిపారు. వివరాలకు సంప్రదించవలసిన వారు మునస్వామి ఫోన్ నెం.9394566440.



## బియ్యం మల్లేశ్వరికి డాక్టరేట్ ప్రదానం

కుప్పం, మే 8 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీ తెలుగుశాఖలో పరిశోధన చేస్తున్న బియ్యం మల్లేశ్వరికి పిహెచ్‌డి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా॥ నాగేశ్వరరావు తెలిపారు. ప్రసారాంగ సహాయ ప్రొఫెసర్ డా॥ హరికృష్ణ పర్యవేక్షణలో అంతటి నరసింహ ం గారి రచనలు,సామాజిక విశ్లేషణ అనే అంశంపై మల్లేశ్వరి సమర్పించిన గ్రంథానికి డాక్టరేట్ అందించామన్నారు. మల్లేశ్వరిని పలువురు అభినందించారు.

## రాష్ట్రాన్ని కాపాడే నాయకుడు చంద్రబాబే

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పంరూరల్, మే 8 ప్రభాతవార్త



రాష్ట్రాన్ని కాపాడే నాయకుడు మాజీ సిఎం చంద్రబాబునాయుడేనని తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం కంగుందిలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసగించిందన్నారు. రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసి యువత భవిష్యత్తును అంధకారంలో నెట్టేసిందన్నారు. 2024 ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేవని ఈ ఎన్నికల్లో ప్రజలు అనుభవం కలిగిన చంద్రబాబుకు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సాంబశివం, రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, డా॥ వెంకటేష్, ధనశేఖర్, రవి, సంతోష్, దివాకర్, షరీఫ్, లోకేష్, గోపి, పార్థసారథి, సుబ్బు, వసంతమ్మ, రామచంద్ర, సంజీవి, తిరుపతి, రాజగోపాల్, మునాఫ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ ఉద్యోగుల సమ్మెకు భాజపా నేతల మద్దతు

కుప్పంరూరల్, మే 8 ప్రభాతవార్త



ద్రవిడ వర్సిటీ తాత్కాలిక బోధనేతర సిబ్బంది చేపట్టిన సమ్మె పదకొండవ రోజుకు కొనసాగింది. వీరికి జిల్లా బిజెపి అధ్యక్షుడు మైందల రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, కుప్పం బిజెపి ఇన్‌చార్జ్ శివశంకర్, మండల కన్వీనర్లు వడివేలు, రామచంద్ర, ఇతర నేతలు మద్దతు పలికారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక ఉద్యోగులను న్యాయం చేసి ఉద్యోగ భ ద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## శాంతిపురంలో వేసవి విజ్ఞాన శిబిరం

శాంతిపురం, మే 8 ప్రభాతవార్త

గ్రంథాలయ శాఖ అధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారిణి సుభాషిణి తెలిపారు. వివిధ అంశాలపై విద్యార్థులకు జూన్ 11 వతేదీ వరకుశిక్షణఇవ్వడంజరుగుతుందన్నారు.వివరాలకు7989924198నెంబరును సంప్రదిం చాలని కోరారు.

## వాహనాలు తనిఖీలు

పాలసముద్రం, మే 8, ప్రభాతవార్త



పాలసముద్రం మండలంలో సోమవారం కృష్ణజి మ్మా పురం పంచాయితీ బలిజకండ్రిగ సమీపంలో వాహనాలను పాలసముద్రం పోలీసులు, కార్వేటి నగరం సర్కిల్ ఇన్స్ పెక్టర్ చంద్రశేఖర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వాహనదా రులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ఈ మధ్యకా లంలో చాలా వరకు యువత యాక్సిడెంట్లో చనిపోతున్నారని తెలిపారు. అలాగే వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని వీటిలో ఏ మాత్రం తేడా వచ్చిన కేసులు పెట్టి కోర్టుకు పంపుతామని వాహనదారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చక్రవర్తి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి బంగారు బాట



గంగవరం, మే 8, ప్రభాతవార్త :

గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి బంగారు బాట వేస్తాయని ఎమ్పీడివో శివప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయ ఆద్వర్యంలో వ్యాస శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే గ్రంథాలయాలకు వెళ్ళి పుస్తక,దినపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలని,విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో అవసరమని,అలాగే నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.గ్రంథాలయ శాఖ ఆద్వర్యంలో ఈ నెల 11వ తేదీ వరకు విద్యార్థులకు డ్రాయింగ్,పేయింటింగ్, క్యారమ్స్, ఆటలు,పాటలు,చెస్,నాటికలు,పుస్తక పఠనం,యోగా వంటి అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరుశరామ్,గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందని ద్రాక్షగా మారిన ఆసరా : మునిచంద్రా రెడ్డి

వెదురుకుప్పం, మే 8 ప్రభాతవార్త :



రాష్ట్రంలో సుమారు 87 లక్షల డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందించవలసిన ఆరువేల నలుగు వందల కోట్ల రూపాయాల మూడవ విడత ఆసరా రుణమాఫీ మహిళలకు అందని ద్రాక్షగా మిగిలిందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతి విభాగం ప్రధానకార్యదర్శి మునిచంద్రా రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వలేని ఈ చేత కాని ప్రభుత్వం డ్వాక్రా మహిళలను కూడా మోసం చేయడం దుర్మార్గమని ప్రభుత్వంను విమర్శించారు. డ్వాక్రా సంఘాలను తన మానస పుత్రికగా భావించి పావల వడ్డీకే రుణాలు మంజూరు చేసిన ఘనత మా చంద్రన్నకే దక్కిందని గుర్తుచేశారు. ప్రభుత్వంకు చిత్తశుద్ధి వుంటే వెంటనే మహిళల ఖాతాల్లోకి నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో మహిళ శక్తి ఈ ప్రభుత్వంకు తగిన బుద్ధి చెపుతుందని హెచ్చరించారు.

## చంద్రబాబు చేసిన అభివృద్ధి ప్రజల్లో తీసుకెళ్దాం

– తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ

కుప్పం, మే 8 ప్రభాతవార్త



రాష్ట్రాభివృద్ధికి మాజీ సిఎం చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధిని ప్రజల్లో తీసుకెళ్దామని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ మహిళా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా విభాగం కమిటీలను వార్డుల వారీగా నియమించడంతో పాటు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ తెచ్చేందుకు మహిళా విభాగం మరింత కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు శారదమ్మ, ప్రధాన కార్యదర్శి తిరుమగళ్, మహిళా నేతలు స్వాతి, జయమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

## ఐఆర్ఎం కాలేజ్‌లో భారీ జాబ్ మేళా.. 90 సంస్థలచే ఇంటర్వ్యూలు



కుప్పం, మే 8 ప్రభాతవార్త

స్థానిక ఐఆర్ఎం డిగ్రీ కాలేజ్‌లో సోమవారం భారీ ఎత్తున నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. సుమారు 90కు పైగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరై ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు హాజరైన 90శాతం మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ఛైర్మన్ తెలిపారు. కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహించే కమ్యూనికేషన్ స్కిల్స్, ముఖాముఖి కార్యక్రమాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. మున్ముందు మరిన్ని పెద్ద సంస్థలచే ప్రాంగణ ఎంపికలు చేపట్టి అందరికీ ఉద్యోగాలు లభించే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. డా॥ అజయ్‌రెడ్డి, అయ్యలరెడ్డి, కిరణ్‌బాబు, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఇంటర్వ్యూలు చేపట్టారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సెజ్‌లలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలి



-కాంగ్రెస్ పార్టి నియోజవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి

వెంకటగిరి మే 8 ప్రభాతవార్త

మేనకూరు సజ్,శ్రీసిటీలలో పనిచేస్తున్న కార్మికులకు 20 వేల రూపాయల జీతాలు పెంచాలని కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులరెడ్డి తెలిపారు.సోమవారం స్థానిక పోలేరమ్మ గుడి కూడలి వద్ద కార్మికులకు జీతాలు పెంచాలని,ఎస్సి,ఎస్టి, బిసి,మైనారిటి విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇవ్వాలని దర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు,గ్యాస్,పెట్రోలు దరలు పెరిగాయని కనుక జీతాలు కూడా పెంచాలని కోరారు.కనీసం 20 వేల రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ముందుగ పోలేరమ్మ గుడిలో శ్రీనివాసులరెడ్డి,నాయకులు పూజలు నిర్వహించారు.

## వైఎస్ఆర్ బీమా పేదలకు వరం

-వైసిపి జిల్లా కార్యదర్శి హరికృష్ణ

వెంకటగిరి మే 8 ప్రభాతవార్త



సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు ఒక వరం లాంటిదని వైసిపి జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. 20 వ వార్డులో మరణించిన దక్కిలి శ్రీనాద్ సతీ మణి రేఖకు సోమవారం 10 వేల రూపాయలను కింద అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత కె షతీష్,సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాలను తనిఖీ చేసిన డిఎల్‌డిఓ

కోట, మే 8 ప్రభాతవార్త



కోట మండలంలోని గూడలి-1, గూడలి-2 సచివాలయాలతో పాటు, వంజివాక, కొత్తపాలెం గ్రామాల్లోని సచివాలయాలను సోమవారం తిరుపతి డిఎల్‌డిఓ వాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హత ఉండి లబ్ధి చేకూరకపోతే అటువంటి వారిని గుర్తించి లబ్ధి చేకూర్చేలా చూడాలని ఆయా సచివాలయాల సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపిడిఓ భవాని, ఇఓపిఆర్‌డి కిరణ్‌కుమార్, నెలవల రాజశేఖర్, రియాజుద్దిన్‌బాషా తదితరులు ఉన్నారు.

## ఎస్ఐగా శోభారాణి బాధ్యతలు స్వీకరణ

కోట, మే 8 ప్రభాతవార్త

కోట పోలీసుస్టేషన్‌లో గత ఆరునెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. తిరుపతి నుంచి బదిలీపై కోట పోలీసుస్టేషన్‌కు ఎస్ఐగా శోభారాణి విచ్చేశారు. ఆ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు.

## బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



- గూడూరు ఏపీఎం బుజ్జమ్మ

గూడూరు, మే 8 ప్రభాతవార్త

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఏపీఎం బుజ్జమ్మ కోరారు. సోమవారం ఆమె వెలుగు కార్యాలయంలో 'ప్రభాతవార్త' ప్రతినిధితో మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని తెలిపారు. మండలంలోని హైరిస్క్ ప్రజలంతా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. పీఎం జీవన్‌జ్యోతి పథకం కింద 18 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు ఏడాదికి 436 రూపాయలు చెల్లిస్తే రెండు లక్షల రూపాయలు ఇన్సురెన్స్ వస్తుందని తెలిపారు. అదేవిధంగా పీఎం సురక్ష బీమా కింద 18 నుంచి 70 సంవత్సరాల వయసు కలిగిన వారు 20 రూపాయలు చెల్లిస్తే ప్రమాద బీమా కింద రెండు లక్షల వరకు చెల్లిస్తారని తెలిపారు. ప్రమాదంలో అంగవైకల్యం కలిగిన వారికి కూడా వర్తిస్తుందని పథకం వివరాలు వెల్లడించారు. ఈ పథకాలలో నమోదు చేయడానికి ఈ నెల 1 నుంచి జూన్ 1 వరకు ప్రతి గ్రామంలోని పేదలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కోట పోలూరులో గడప గడపకు మన ప్రభుత్వం

సూళ్లూరుపేట, మే 8 ప్రభాతవార్త

సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. ఎవరు ఏ పథకం ద్వారా ఎంతవరకు లబ్ధి పొందారనే అంశాలను ప్రజలకు చెప్పారు. అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలను అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని, ఆ పాలన కొనసాగాలంటే తిరిగి మద్దతు పలకాల్సిన అవసరం ఉందన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పే వారిని పక్కనపెట్టి ఎవరైతే ప్రజల పక్షాన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగల సత్తా ఉందో ప్రజలు గుర్తించి వారికి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, సర్పంచ్ అరుణకుమారి, కోటపోలూరు గ్రామ వైసీపీ నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులకు సన్మానం

సూళ్లూరుపేట, మే 8 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల లో ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఉత్తీర్ణులైన విద్యార్థులను సోమవారం హైస్కూలు ఆవరణలో ఘనంగా సన్మానించారు. 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో 58 శాతం ఉత్తీర్ణత తీసుకొచ్చేందుకు సహకరించిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి అభినందనలు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదవాలని ఆమె సూచించారు.

## పాత బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు ప్రారంభం

గూడూరు, మే 8 ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని పాతబస్టాండు ప్రాంతంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికులు, పేదల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మించారు. సోమవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఆర్డీఓ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ సులభ్ కాంప్లెక్స్ అధ్వానంగా ఉండటం, డబ్బులు వసూలు చేస్తుండటంతో నూతనంగా మరుగుదొడ్లు నిర్మించడం జరిగిందన్నారు. దేవసేనమ్మ చొరవతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించడం జరిగిందన్నారు. డంపింగ్ యార్డును తొలగించడంలో దేవసేనమ్మ చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్, కమిషనర్ సాయినాథ్, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, కోడూరు మీరారెడ్డి, నరసయ్య, అన్నం మురళి, అజీజ్‌ఖాన్, అల్తాఫ్‌బాయ్, గోపాల్ యాదవ్, ఈతముక్కల వెంకట రమణయ్య, దయాకర్, వంశీ, తూపిలి లక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అసైన్‌మెంట్ కమిటీ సమావేశం

గూడూరు, మే 8 ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, ఆర్డీఓ కిరణ్‌కుమార్‌లు పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు భూపంపిణీ చేస్తున్నారని తెలిపారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములను గుర్తించి వారికి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచడం సంతోషకరమన్నారు. ఆ భూమిని సేకరించిపేదలకు ఇచ్చేందుకు భూపంపిణీ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారని, ఈ నెల 12వ తేదీన కావలిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరించాలని దేవసేనమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, సాయి, జమళ్ల వాసు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ సీఆర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన రామ్‌కుమార్‌రెడ్డి

గూడూరు, మే 8 ప్రభాతవార్త



గూడూరు ప్రజలకు సుపరిచితుడైన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఆర్‌రెడ్డి ఇటీవల కన్నుమూసిన విషకం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దివంగత డాక్టర్ సీఆర్ రెడ్డి కుటుంబ సభ్యులైన డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిలను పరామర్శించారు. పెద్దాయన సీఆర్‌రెడ్డి ఎంతోమంది పేద ప్రజలకు తక్కువ ఖర్చుతోనే ఎన్నో సేవలు చేశారని, ఆయన మృతిచెందడం చాలా బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిలకు పెద్దాయన ఆత్మ ఎక్కడో లేదని, మన మధ్యనే ఉందని, మీరు ధైర్యంగా ఉండాలని ఓదార్చునిచ్చారు. ఆయన వెంట గూడూరు శ్రీనివాసులురెడ్డి, గూడూరు ఎంపిపి బూదూరు గురవయ్య, వైసీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామ్‌కుమార్‌రెడ్డితో వైకాపా నాయకులు భేటి

వాకాడు, మే 8, ప్రభాతవార్త



రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఆఫ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి అసెంబ్లీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డితో సోమవారం వైకాపా నాయకులు భేటీ అయ్యారు. గూడూరు డివిజన్ పరిధిలో గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి మండలాల నాయకులతో ఆయన కలిసి మాట్లాడారు. వచ్చిన నాయకులకు మంగళవారం తన తండ్రి వర్ధంతి వేడుకలకు రావాలని ప్రతి ఒక్కరిని ఆయన కోరారు. ముఖ్యంగా మండలంలోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక నాయకులతో అధికారులతో చర్చించారు. గూడూరు చెందిన వైకాపా సీనియర్ నాయకుడు బతెన విజయకుమార్ రామ్ కుమార్ రెడ్డికి పూల మాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సుధాకర్ నాయుడు, మాజీ ఎంపిపి మధుసూధన్ రెడ్డి, వెంకటరత్నం, మండల స్థాయి అధికారులు గోపినాథ్, సారంగపాణి, ఎన్. బాబు, ప్రవీణ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రదానం

చిల్లకూరు, మే 8, ప్రభాతవార్త

చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని వరగలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినటువంటి బి. మానస (534), చిల్లకూరు గురుకుల పాఠశాల విద్యార్థి ఎం. రేవంత్ (533), కడివేడు జడ్పి పాఠశాలలో పి. బాలాజీ (531) మార్కులు సాధించారు. వీరిని చిల్లకూరు తహశీల్దార్ అజమతుల్లా ఖాన్, గూడూరు రూరల్ సిఐ ధశరధరామారావులు బి. మానస, ఎం. రేవంత్, పి. బాలాజీలను శాలువాలతో ఘనంగా సన్మానించి కుర్చీ, పెన్ను, ప్లాడ్లు వారికి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఎంతో ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలన్నారు. అనంతరం ఒక్కరిని వారు ఏమేమి ఉద్యోగాలు చేస్తారని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నారదపుష్కరిణి వద్ద అన్నదానం



శ్రీకాళహస్తి, మే 8 ప్రభాతవార్త

మాజీ మంత్రివర్యులు దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి ఆయన సోదరుడు దివంగత నేత బొజ్జల హరనాథరెడ్డిల సందర్భంగా తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, చక్రాలమహేష్‌ల ఆధ్వర్యంలో నిరుపేదలు సుమారు వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చక్రాల.ఉష మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి ఒక్కరే అన్నారు. కార్యక్రమంలో అనిత, దుర్గ, ఊహ, జయశ్రీ,సుభాషిణి, శ్రీలక్ష్మి, చంద్రకళ, సునీమా, బుజ్జి, కేశవ, ప్రసాద్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## బాలిశెట్టివర్మకు నివాళులు



శ్రీకాళహస్తి, మే 8 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ యువనాయకుడు, పార్టీలో ఎప్పుడూ, ఏ కార్యక్రమాల్లో అయినా ముందుండే వాడు బాలిశెట్టివర్మ అని నేడు ఆయన లేని లోటు ఎవ్వరు తీర్చలేరని చక్రాల.ఉష అన్నారు. సోమవారం బాలిశెట్టివర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక బాబుఅగ్రహారం వద్ద తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు బాలిశెట్టివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కరోనా సమయంలో వర్మ మృతి బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ఉష, బుజ్జి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ఏజెన్సీకి అభినందనలు

ఎంఎల్సి సిపాయి

శ్రీకాళహస్తి,మే 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భారీ ఎత్తున మెగా మెడీ నిడ్స్ మెడికల్ ఏజెన్సీని శాసనసభ్యుడు బియ్యపు మదు సూధనరెడ్డి ప్రారం భిం చారు. సోమవారం ఎంఎల్సి, రష్ అధినేత సిపాయి సుబ్రమణ్యం హాజరై అభినందించారు. ఆయనకు నంద మెడికల్స్ అధినేత కొండూరు నరసింహులు (నంద) సారధ్యంలోభారీ ఎత్తున స్వాగతం పలికారు.నేడు వాతావరణదృష్ట్యా రక రకాల వ్యాధులు చోటు చేసుకుంటుంది.కాబట్టి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పుణ్యక్షేత్రంలో మెగా మెడి నిడ్స్ ఏజెన్సీని ఏర్పాటు చేయటం హర్షణీయం అన్నారు.నేడు ప్రభుత్వం అందరికి వైద్యం అందుబాటులో ఉంచటానికిఅన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డినిరుపేదలకుఅందుబాటులోఅన్నిసదుపాయాలు కల్పించటంలో కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమాలకు మరో ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో కొండూరు నరసింహులు, మునిరెడ్డి,కార్తీక్‌రెడ్డి, నెహ్రూ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై జనసేన నాయకులు పర్యటన

శ్రీకాళహస్తి, మే 8 ప్రభాతవార్త



నా నియోజకర్గం కార్యక్రమంలో భాగం గా జనసేన నాయకులు 51వరోజు సోమవారం నిర్వహిం చిన కార్యక్రమంలో శ్రీరాంనగర్ కాలనీలోని గోపికృష్ణవీది .లో పర్యటించారు. నియోజకవర్గ ఇన్ ఛార్జి వినుత కోట కాలనీలోని వినాయకవీధి, ప్రధానవీదిలో గడపగడపకు వెళ్ళి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ కాలువలు పునర్నిర్మాణం చేస్తామన్న అధికార పార్టీ పట్టించు కోలేదని ప్రజలు తెలిపారు. కాలువలపై కప్పులు లేక దుర్వాసనతో ఇబ్బందిగా ఉందని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది పారిశుధ్యపనులు రోజు చేయడం లేదని వారి దృష్టికి తెచ్చారు. తద్వారా దోమలబెడదతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు ఆమె దృష్టికి తెచ్చారు. సమస్యలను మున్సిపల్ అదికారులకు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌ను ఆశీర్వదించాలని, తద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని వినుత ప్రజలను కోరారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షులు కొప్పాలగోపి, నాయకులు తులసీరాం, జనసైనికులు భాను, వెంకటేష్, ప్రకాష్, సుధీర్, హేమంత్, వరుణ్, సాయి, హరి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించండి

-తెదేపా నాయకుల డిమాండ్



నాగలాపురం, మే 08, ప్రభాతవార్త: మండలం లోని గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత రెండేళ్ళుగా వేతనాలు చెల్లించకపో వడం దారుణమని తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపడ్డారు. వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో యంపిడివో పద్మజను కలుసుకుని, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించేందుకు చొరవ చూపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో తెదేపా మండల అధ్యక్ష్యుడు శ్రీనివాస్, నాయకులు కుమార్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే ఆదిమూలం

- చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు

సత్యవేడు, మే08, ప్రభాతవార్త:



ప్రభుత్వ భూముల కబ్జా విషయాలపై కఠినంగా చర్యలు తీసుకువాలని సత్య వేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం రెవిన్యూ అధికారులను ఆదేశించారు. తెదేపా నేతల భూకబ్జాల చిట్టాను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రతిమ అధ్యక్ష్యతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పలు పంచాయితీల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు బడాబాబుల గుప్పెట్లో ఉన్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తమారికుప్పం పంచాయితీలో సర్వే నంబరు 374, 375లో 14 ఎకరాలు, పివి పురంలో కొన్ని వందల ఎకరాల ప్రభుత్వభూమి అన్యాంక్రాంతమైందన్నారు. దీంతోపాటు నాగలాపురం మండలంలోని సురుటుపల్లి గ్రామంలో పేదలకు ఇచ్చిన డికెటీ పట్టాలు పరులపాలు అవుతోందన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం తన వ్యాఖ్యలను సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, మాజీ ఎంపిపి మస్తాన్‌ను ఉద్దేశించి చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడు వాసుల గుప్పెట్లోనూ కొంత డికెటి భూములు ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. డీకేటి భూముల అన్యాక్రాంతంపై ఆయా పంచాయితీల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసిలు కూడా తగు సమాఛారాన్ని అందిస్తే డీకేటి భూముల వ్యవహారాన్ని నిగ్గుతేలుస్తామని స్పష్టం చేశారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే చేపట్టి రైతులను గుర్తించాలని ఇటు సత్యవేడు, అటు నాగలాపురం తహసిల్దారులను కోరారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ నిమిత్తం 6కోట్లు, నిర్మాణానికి 20కోట్లు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఇతర మండలాలతో పోలిస్తే సచివాలయ భవన నిర్మాణాలు సత్యవేడులో భాగా వెనుకబడి ఉండటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భవన నిర్మాణాలను పూర్తి చేయని గుత్తేదారులకు నోటీసులు ఇచ్చి వేరే వారికి అప్పగించాలని పంచాయితీరాజ్ డీఈకు ఆదేశించారు. అలాగే మండలంలోని దాసుకుప్పం, చిన్నఈటిపాకం పంచాయితీలలోని పలు సమస్యలను చర్చించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసి విజయ లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపిటీసిలు, అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్ తహశీల్దార్‌ను కలిసి వైకాపా నాయకులు

తిరుపతిరూరల్, మే 8 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ తహశీల్దార్ టి.వి. సుబ్రమణ్యంకు తిరుపతిరూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బియన్‌కండ్రిగ నుండి బదిలీపై తిరుపతిరూరల్ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సుబ్రమణ్యంను మర్యాదపూర్వకంగా కలిసినట్లు వైకాపా నాయకులు తెలిపారు. మండలంలో భూ సమస్యలు పరిష్కరించి రైతులు మేలు చేకూర్చాలని కోరినట్లు తెలిపారు. భూ సమస్యలపై ప్రజలు కాలు అరిగెలా తిరగకుండా తమ పరిధిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను తక్షణం పరిష్కరించాలని విన్నవించారు. ఈ తహశీల్దార్‌ను కలిసినవారిలో వైకాపా నేతలు వైకాపా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, తిరుపతిరూరల్ ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వరరెడ్డి, పేరూరు ఎంపిటిసి మూలం చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేద్దాం

మేయర్ డా.శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, మే 8, ప్రభాతవార్త



ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మన మంతా కృషి చేయాలని అధికారులనుద్దేశించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత అన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం సోమవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. మొదటి డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ పదవ తేది బుధవారం తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి తమ నివాసం నుండి కాలి నడకన అమ్మవారి భక్తులతో కలిసి గంగమ్మకు సారెను తీసుకెలుతారని, అందువల్ల సారెను తీసుకెల్లె రహదారులను శుభ్రంగా వుంచేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో ఎంకె నాయుడు కాలనీ నుండి వచ్చిన ఫిర్యాదులో తమ వీధిలోని కుక్కని తీసుకెల్లి పన్నెండు రోజులైనప్పటికి తిరిగి తీసుకురాలేదన్నారు. మదురానగర్‌లో కాలువపై మెట్లు కట్టేసారని, దీని వలన తరుచుగా కాలువలోని నీరు రోడ్డుపైకి వస్తున్నదన్నారు. నారాయణపురంలో అక్రమంగా రోడ్డుపై గోడ కట్టేసారని, జీవకోన సాయినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ శిధిలావస్తకు చేరిందని చెబుతు ఆ ట్యాంక్ శిధిలావస్తకు చేరిందని చెబుతు ఆ ట్యాంక్‌ను తొలగించాలన్నారు. రాయలనగర్‌లో నిర్మిస్తున్న సచివాలయంలో పిచ్చి మొక్కలు పెరిగి, పాములు తిరుగుతున్నాయని, ఆ చెట్లను తొలగించాలని, సచివాలయాన్ని పూర్తి చేయాలన్నారు. సుందరయ్య నగర్‌లో కాలువలు నిర్మించాలని, నగరంలో మినరల్ వాటర్ ప్లాంట్లు నాణ్యత పాటించడం లేదని, వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు ఫిర్యాదులు చేయగా పరిశీలించి తగు చర్యలు చేపడుతామన్నారు. డయల్ యువర్ కమిషనర్ నాయకులు ఫిర్యాదులు చేయగా పరిశీలించి తగు చర్యలు చేపడుతామన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కి 20 స్పందన కార్యక్రమానికి వచ్చిన 23 ఫిర్యాదులపై స్పందిస్తూ అతి త్వరగా తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హరిత ఫిర్యాదుదారులకు తెలిపారు. అదే విధంగా ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ మీ సమస్యల పరిష్కారానికి మీ సచివాలయాల్లో సంప్రదించాలని, అక్కడ పరిష్కరించని పక్షంలో తమ వద్దకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డా. హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, మేనేజర్ చిట్టిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఐసర్ కార్మికులకు భద్రత కల్పించండి: ఆర్‌డిఓకు వినతి

పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి రూరల్,మే 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు సమీపంలో కేంద్ర ప్రభుత్వం 2016లో శ్రీకారం చుట్టిన ఐసర్ భవన నిర్మాణాలకు వచ్చిన కార్మికుల ఆరోగ్యం,భద్రత ప్రశ్నార్థకంగా మారింది.ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ఐసర్ విద్యాసంస్థల నిర్మాణం ప్రతిష్టాత్మకంగా సాగుతుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి ఇక్కడ తరగతులు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి.ఇటీవలే కొత్తడైరెక్టర్‌ను నియమించారు.

**భద్రత కల్పించండి:** ఇక్కడి నిర్మాణాల్లో పని చేస్తున్న కార్మికుల కు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి.మూడు రోజులుగా ఇక్కడ పని చేస్తున్న కార్మికులు ఆసుపత్రి పాలయ్యారు.రోజుకు రోజుకుఆసుపత్రి పాలౌతున్న కార్మికుల సంఖ్య పెరుగుతుంది.కానీ పట్టించుకునే దిక్కులేదు. వలస రంగ కార్మికులకు ప్రభుత్వం వలసకార్మిక చట్టం ప్రకారం అన్ని రకాల బద్రత కల్పించాలని సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేసారు. ఐసర్ కార్మికుల పట్ల డిఈసి కంపెనీ నిర్లక్ష్య వైఖరిని వారు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కె,యస్ రామారావుకు అందించారు. ఐసర్ నిర్మాణంలో మధ్యప్రదేశ్,బీహార్, చండీఘడ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మంది వలసరంగ కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ పని చేస్తున్న కార్మికుల వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద కాని లేబర్‌శాఖ వద్ద కానీ లేకపోవటం శోచనీయమన్నారు. ఇక్కడ కార్మికులకు అందించాల్సిన కనీస సదుపాయాలు అందించటంలో విఫల మౌతున్నారన్నారు.కార్మికులను రేకుల షెడ్లు వేసి కనీసం కాలకృత్యాలు తీర్చుకోవటానికి మరుగుదొడ్లు కూడా లేదన్నారు. కార్మికులకుఅ ందించాల్సిన పిఎఫ్,ఈఎస్ఐ సదుపాయాలు కల్పించటంలో కంపెనీ కల్పించలేదన్నారు.సిఐటియు నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణ, కుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఈ గతుకు్క తట్టెడు మట్టి ఎవరు పోయాలి?

అధికారులు పట్టించుకోరు! కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

శ్రీకాళహస్తి,మే 8 ప్రభాతవార్త



ఈ గతుకు్క తట్టెడు మట్టిపోసే దిక్కులేకుండా పోయింది.నడిరోడ్డులో అడ్డంగా గోతులు తవ్వి దానికి తట్టెడు మట్టిపోయలేక కాంట్రాక్టర్ వదలిపెట్టారు. ఇకసంబంధితఆర్‌అండ్‌బిఅధికారులురోడ్లను పర్యవేక్షించరు.ఏ సమస్య ఉందో పట్టించుకోరు. నిత్యం ఈ రోడ్లు మీద పయనించే ప్రజాప్రతి నిధులు, పాలకులకు కనబడటం లేదు.కానీ ఈ సమస్యతో వాహన చోదకులు ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు తల్లడిల్లుతున్నారు. శ్రీకాళహస్తిలోని నాలుగుమాడావీధుల్లోనూ, మధ్యలోని వీధుల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటును రూ.14కోట్లుతో చేపట్టారు. పనులు ప్రారంభించి ఆర్నెల్లు గడిచింది. మహాశివరాత్రికి ముందే పనులు పూర్తి చేయాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కాంట్రాక్టర్లను పరుగులు తీయించారు. కానీ పూర్తి కాలేదు.తరువాత పనులు జరగటం లేదు. నాలుగు మాడావీధుల్లోని బేరివారి మండపం సమీపంలోనూ, బిక్షాల గాలిగోపురానికి సమీపంలోనూ, నెహ్రూ వీధిలోని శ్రీరామమందిరం వద్ద రోడ్డు కడ్డంగా గోతులు తవ్వారు.కేబుల్ ఏర్పాటు చేసిన వెంటనే పూడ్చి ఉండవచ్చు. కానీ వారు పట్టించుకోలేదు. ఒక సారి ఎవరైనా ఈ రోడ్లు మీద వాహనాల్లో పయనిస్తే ఇంత నిర్లక్ష్యమా? అనే భావం కల్గుతుంది.కోట్ల రూపాయల టెండరు సొంతం చేసుకున్న కాంట్రాక్టర్ రోడ్డుకడ్డంగా గుంతలు తవ్వి వదలి పెడితే ఎలా కనీసం తట్టెడుమట్టి అయినా పోయాలి కదా? ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప సంబంధిత ఆర్‌అండ్‌బి శాఖ పట్టించుకోదా? అని జనం చర్చించుకుంటున్నారు.

## పుస్తకపఠనంతోనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు



తొట్టంబేడు, మే 8 ప్రభాతవార్త

పుస్తకపఠనంతోనే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని తొట్టం బేడు ఎంఈవో సిహెచ్ఎం భారతీ అన్నారు. సోమవారం జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ నైనారు మధుబాల దిశానిర్దేశంతో వేసవి విజ్ఞాన శిబిరం తొట్టంబేడుశాఖా గ్రంధాలయ ఆధ్వర్యంలో తొట్టంబేడు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి ముఖ్యఅతిధులుగా ప్రారంభించారు.ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ప్రతి ఏడాది శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల్లో పుస్తకపఠనంతో పాటు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించడంతో వారిలో ఉత్తేజాన్ని నింపుతాయని ప్రతి ఒక్కరు పోటీతత్వంను అలవరచుకుని ముందుకుసాగాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేదిశగా ముందుకుసాగాలని కోరారు. ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి మాట్లాడుతూ విజ్ఞానంతోనే విద్యార్థులు తమ మేధాశక్తిని పెంచుకోవచ్చన్నారు. తొట్టంబేడు గ్రంధాలయాధికారి ఏ.హరికృష్ణ మాట్లాడుతూ ఈతరగతులు జూన్ 11 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, పద్మనాభం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు వరదరాజస్వామి ఆలయ నిర్మాణానికి కాంక్రీట్

పనులు పరిశీలించిన చైర్మెన్

శ్రీకాళహస్తి,మే 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం గా నిర్వహిస్తున్న ప్రసన్న వరద రాజస్వామి ఆలయ జీర్ణోద్ధారణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కాంక్రీట్ పనులు చేపట్టనున్నారు. ఈ నేపధ్యంలో సోమవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పనులు వేగవంతంగా నాణ్యతతో చేపట్టాలన్నారు.రాబోవు వార్షికోత్స వాలకు ఆలయాన్ని సిద్ధం చేయాలన్నారు.రూ.6కోట్లతో చేపట్టిన పనులను సోమవారం దేవాదాయశాఖ ఎస్ఇ పుల్లయ్య హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఇంజనీరింగ్‌శాఖకు చెందిన ఎఇఇ కిషోర్‌కుమార్, స్థపతి కుమార్, సూర్యప్రసాద్, కాంట్రాక్టర్లు యువశేఖర్,విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంతో విద్యార్థులకు ఆటవిడుపు



సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి

చంద్రగిరి, మే 8 ప్రభాతవార్త:

గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన వేసవి విజ్ఞాన ఉచిత శిక్షణా శిబిరం విద్యార్థులకు ఆటవిడుపు కాగలదని సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి అన్నారు. స్థానిక పాతపేటలోని గ్రంథాలయంలో సోమవారం ఆమె వేసవి విజ్ఞాన ఉచిత శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకుగల విద్యార్థులకు యోగా, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రామా, చెస్, క్యారమ్స్, సంగీతం, డ్యాన్స్, వంటి పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.మొదటి రోజు నిర్వహించిన మ్యూజికల్ చైర్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు.గ్రంథాలయ అధికారి ఎ.రెడ్డెమ్మ, సిబ్బంది భారతి, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి బొజ్జలకు ఘన నివాళి - టీడీపీ

కేవీబీ పురం, మే 8 ప్రభాతవార్త:

మాజీ మంత్రి, కేవీబీ పురం మండలాన్ని దత్తత తీసుకున్న మహనాయకుడు ఆరాధ్య దేవుడైన స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామానుజన్‌నాయుడు, కె.గోపినాథ్‌రెడ్డి, తెరణి జయరాంరెడ్డి ఆధ్వర్యంలో ఇదే మా ఘన నివాళులంటూ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మా పెద్దాయనకు ఘన నివాళి మేము ఎప్పుడూ మరచిపోలేని మహ నాయకుడు మా మండలానికి అత్యంత ప్రీతి పాత్రులు అయిన బొజ్జల గోపాలన్న మీరు మా మధ్య లేకుండా అప్పుడే ఒక సంవత్సరం గడిచిపోయిందని, మీరు మా మధ్య లేకున్నా మీరు చేసిన పనులు ఎప్పుడూ మరచిపోలేమని కేవీబీ పురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు తెలియజేశ్వారు. అదే విధంగా తిరుపతి పార్లమెంట్‌రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జయరాంరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, సత్యవేడు యువత అధ్యక్షుడు లక్ష్మిపతిరాజు, సత్యవేడు నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ కన్వీనర్ కందస్వామి, మాజీ సర్పంచ్‌లు చెంగారెడ్డి, వెంకటేష్, చంద్రయ్యనాయుడు, బాలకృష్ణమరాజు, పరందామయ్యరెడ్డి, యువ నాయకులుమునికుమార్ యాదవ్, శోభన్‌బాబు నివాళులర్పించి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

## నావిలో షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫ్ ఆఫీసర్స్

రిక్రూట్మెంట్‌కు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు

తిరుపతి (క్రీడ), మే 8, ప్రభాతవార్త

భారత త్రివిధ దళాల్లో ఒకటైన ఇండియన్ నేవి తాజాగా షార్ట్ సర్వీస్ కమిషనర్ ఆఫీసర్ ఉద్యోగాలకు అర్హులైన అవివాహిత మహిళ, పురుషుల అభ్యర్థుల నుండి దరఖాస్తుల కొరకు అధికారిక పోర్టల్ ద్వారా మే 14 లోపు అప్లై చేసుకోవాల్సిందిగా సెట్విన్ సిఈఓ డా. మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిది బ్రాంచిలలో, వివిధ క్యాడర్లలో అండర్ గ్రాడుయేట్, డిగ్రీ చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకోవాల్సిందిగా కోరారు. అయితే కనీసం ఆరవై శాతం మార్కులతో పాసయి వుండాలన్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. లేదా అందుకు సమానమైన సిజిపిఏ ఉండాలని అప్లికేషన్ ప్రాసెస్ ముందుగా అధికారిక పోర్టల్‌ను విజిట్ చేయాలని హోం పేజీలోకి వెళ్లి షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ రిక్రూట్మెంట్ లింక్ పై క్లిక్ చేయాలన్నారు. వివరాలతో రిజిస్టర్ అవ్వాలన్నారు. ఆ తర్వాత లాగిన్ అయి అప్లికేషన్‌ను పూర్తి చేయాలన్నారు. అవసరమైన డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలని చివరిగా అప్లికేషన్ పేజుచెల్లించిఅప్లికేషన్‌ఫారంనుసబ్మిట్‌చేయాలన్నారు.అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పోలాక్షమ్మ గుడి పూజలో దళితులకు అవకాశం కల్పించాలి

పుత్తూరు, మే 8 ప్రభాతవార్త :

మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలోని పోలాక్షమ్మ ఆలయంలో జరిగే పూజల్లో పాల్గొనేందుకు దళితులకు అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు డి.మహేష్, గ్రామస్తుడు కె.బాబు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పోలాక్షమ్మ గుడిలో దళితులకు ప్రవేశం ఇస్తున్నారు తప్ప, పూజలో పాల్గొనేందుకు స్థానిక అగ్రవర్ణాల వారు నిరాకరిస్తున్నారని తెలిపారు. స్థానిక సర్పంచ్‌కు దళితులు దీనిపై విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. రామకృష్ణాపురం చుట్టుపక్కల వున్న ఏడు గ్రామాల ప్రజలకు ఆలయంలో పూజలు చేసుకునేందుకు అర్హత వుందని దళితులకు మాత్రం లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి గుడిలో పూజలు దళితులకు అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పుత్తూరు తహశీల్దారును ఫోన్‌లో ఆదేశించినట్టు దళిత నాయకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు చక్రపాణి, గజపతి, మనోహర్, చంద్ర, మునెయ్య, లోకేష్, నాగమణి తదితరులున్నారు.

## చిదా స్పిన్నింగ్ కార్మికులకు న్యాయం చేయాలి

పుత్తూరు, మే 8 ప్రభాతవార్త :

చిదా స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ మిల్లు మేస్త్రి ఏలుమలైరెడ్డి, మరికొంత మంది కార్మికులు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గతంలో ప్రభుత్వం అనుమతి లేకుండా యాజమాన్యం లేఆఫ్ ప్రకటించిందని దీనిపై కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై చర్చలు జరుగుతున్న సమయంలో కార్మిక సంఘ నాయకులతో యాజమాన్యం తమకు అనుకూలంగా కార్మికుల నుంచి సంతకాలు సేకరిస్తోందని తెలిపారు. సంతకాలు చేయకపోతే బకాయిల నగదు ఇవ్వమని బెదిరిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

## రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌లకు బిల్లులు విడుదల చేయాలి

ధనంజయ యాదవ్

విజయపురం, మే 8 ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లుల బకాయిలను, నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని చిత్తూరు జిల్లా ఉమ్మడి పంచాయతీ రాజ్ అధ్యక్షుడు ముక్కా ధనంజయ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దర్శి మండలం రామచంద్రాపురం పంచాయతీ సర్పంచ్ ధనలక్ష్మి చేసిన పనులకు బిల్లులు రాక, గ్రామాభివృద్ధి కోసం చేసిన అప్పులు, వడ్డీల బాధలు భరించలేక ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన రూ. 8660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి వేరే అవసరాలకు వాడుకుందని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వున్న 12,918 మంది అధికార, ప్రతిపక్ష సర్పంచ్‌లకు బిల్లుల రూపేణా రావాల్సిన వేలాది కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్ ధనలక్ష్మి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు నిధులు, బిల్లుల బకాయిలు విడుదల చేయకపోతే ధనలక్ష్మి ఆత్మహత్య లాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతమయ్యే అవకాశం వుందని తెలిపారు.

## 'బిజినెస్ ఎక్స్‌పో 2023' బ్రోచర్ ఆవిష్కరణ



-జూన్ 10,11 తేదీలలో శిల్పారామంలో ప్రదర్శన

తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 8 ప్రభాతవార్త:

జూన్ 10,11 తేదీలలో రెండు రోజుల పాటు స్థానిక శిల్పారామంలో వ్యాపారస్తులు తయారు చేసిన ఉత్పత్తులను జేసిఐ ఆధ్వర్యంలో 81 స్టాల్స్ ద్వారా ప్రదర్శనకు ఉంచనున్నట్లు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసిఐ) తిరుపతి అధ్యక్షుడు గుణశేఖర్ తెలిపారు.ఈ మేరకు సోమవారం స్థానిక జేసిఐ కార్యాలయంలో ప్రదర్శనకు సంబంధించిన 'బిజినెస్ ఎక్స్‌పో 2023' బ్రోచర్‌ను ఏపి బిషప్స్ కౌన్సిల్ చైర్మన్,తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥యలమంచిలి ప్రవీణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. జేసిఐ సభ్యులు వైఎస్. బాబు,జి.శంకర్, దొరస్వామి,శేషసాయి,చైతన్య తేజ్,వినయ్,జేసిఓఎం తిరుపతి అధ్యక్షుడు నామా రాజేష్ పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్ గది ప్రారంభం



నగరి, మే 8 ప్రభాతవార్త:

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నవీకరించిన వీడియో కాన్ఫరెన్స్ గదిని ఎంపీపీ భార్గవి ప్రారంభిం చారు. సోమవారం మధ్యాహ్నం మండల అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎంపీపీ వీడియో కాన్ఫరెన్స్ గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించుకోవడానికి గదిసక్రమంగా లేకపోవడంతో మంత్రి రోజా సహకారంతో గదిని నవీకరించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శేషగిరి రావు, ఎంఈవో శ్రీదేవి, వైస్ఎంపీపీ కన్నియప్ప, తెరణి ఎంపీటీసీ ఏసు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## దుర్గసముద్రంలో మంచినీటి పైపుకు మరమ్మతులు

తిరుపతిరూరల్, మే 8 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ దుర్గసముద్రంలో మంచినీటి పైప్‌లైన్‌కు పంచాయతీ సిబ్బంది మరమ్మత్తులు చేసి, నీటి వృధాను అరికట్టారు. పంచాయతీలో మంచినీరు సరఫరా చేసే పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో స్థానికులు పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ దృష్టికి తీసుకెళ్ళగా ఆమె తక్షణమే స్పందించి, సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మత్తు చేయించారు. ప్రజా సమస్యపై తక్షణం స్పందించిన పంచాయతీ కార్యదర్శిని స్థానికులు అభినందించారు.

# పార్టీలకు అతీతంగా... బొజ్జల సోదరులకు నివాళులు






శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తిరూరల్,మే 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల సోదరుల సాంవత్సరీకం సందర్భంగా రాజకీయ వేడి చోటు చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు బొజ్జల హరినాథ్‌రెడ్డిల ప్రథమ వర్ధంతి ఊరందూరు గ్రామంలో సాదాసీదాగా నిరాడంబరంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి తదితర నియోజక వర్గాల రాజకీయ నాయకులు పార్టీలకు హాజరై నివాళులర్పించారు. బొజ్జల కుటుంబంతో మమేకమై, బొజ్జల సోదరుల గత స్మృతులను గుర్తు చేసుకున్నారు.2019 ఎన్నికల్లో పరాజయం పొందిన తెలుగుదేశం నాయకులు రాబోవు ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించుటకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వర్ధంతి సభలకు నియోజకవర్గంలోని నాయకులు హాజరు కావటం చర్చనీయాంశంగామారింది.

**సమాధి వద్ద నివాళులు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని గోపాలకృష్ణారెడ్డి ఐదుసార్లు గెలిచిపలుమార్లు మంత్రిగా కొనసాగారు.అలాగే మండల వ్యవస్థ ఏర్పడినపుడు శ్రీకాళహస్తి మొదటి మండలాధ్యక్షుడుగా బొజ్జల హరినాథ్‌రెడ్డి పరిపాలించారు. సోమవారం మొదటి వర్ధంతి సందర్భంగా సమాధుల వద్ద కుటుంబసభ్యులు నివాళుల ర్పించి పూజలుజరిపారు. ఈ వర్ధంతి సభలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లా నుంచి ప్రముఖులు హాజరై నివాళులర్పించారు.అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు.ప్రముఖుల రాకతో గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రముఖుల నివాళులు:**

రాష్ట్ర రాజకీయాల్లో తమదంటూ స్థానాన్ని సుస్థిరం చేసుకున్న గోపాలకృష్ణారెడ్డికి మంచిపేరు ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా మంచి సర్కిల్ ఉంది.వర్ధంతి వేడుకలకు మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, తిరుపతి మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ,తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ శాసనసభ్యులు ఎస్‌సివి నాయుడు,సత్యవేడు మునిరామయ్య, బిజెపి నేతలు సైకం జయచంద్రారెడ్డి, కోలా ఆనంద్‌కుమార్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి చలపతి నాయుడు, దశరధాచార్యి,రెడ్డివారి గురవారెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, బ్రహ్మేశ్వరభూషణం రెడ్డి, సిద్ధాగుంట సిద్దారెడ్డి,మాజీ సింగిల్ అధ్యక్షుడు ధనంజయులు నాయుడు,శివశంకర్‌రెడ్డి, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాలను బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో రంగినేని చెంచయ్య నాయుడు, రావిళ్ల మునిరాజానాయుడు, విజయకుమార్, కంఠామేష్, రాంబాబునాయుడు, కామేష్ యాదవ్, బొజ్జల సురేష్‌రెడ్డిలు పర్యవేక్షించారు.

## సామాజిక సేవలకు ఎన్టీఆర్ జాతీయ అవార్డుల ప్రదానం




తిరుపతి,మే 8(ప్రభాతవార్త): విద్య...సాహిత్యం, సమాజసేవా రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో జాతీయ అవార్డులతో సత్కరించారు. సోమవారం తిరుపతి యూత్‌హాస్టల్‌లోజరిగిన ఎన్టీఆర్ శతజయంతి వేడుకల సభలో గుత్తా హరిసర్వోత్తమనాయుడు, గొర్తి వెంకటస్వామిలు , వేంకటపద్మావతి ఛారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ నందిపాటి చక్రపాణి, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.నారాయణస్వామి తదితర ప్రముఖులకు ఎన్టీఆర్ జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి ,కవి, సామాజిక వేత్త గుత్తా హరిసర్వోత్తమ నాయుడును సత్కరించారు. జిల్లా వాసులకు ఎన్టీఆర్ శతజయంతి వేడుకల పురస్కారం రావడం పట్ల పలువురు కవులు, కళాకారులు, రచయితలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా రంగాల్లో వీరంతా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, ఎన్టీఆర్ శతజయంతి వేడుకల నిర్వాహకుడు నందిపాటి చక్రపాణి విజయవంతంగా కార్యక్రమం నిర్వహించారు.

## సమస్యలకు మొదటి ప్రాధాన్యత వెంటనే పరిష్కారం : ఎస్పి



తిరుపతి క్రైం, మే 8 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత త్వరితగతిన పరిష్కారమని ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి ప్రజల నుండి పిర్యాదులు స్వీరించారు. ఎస్పి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి దాదాపు 66 మంది వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పి కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించడం జరుగుతుందని తెలిపారు.

## టిటిడి నిఘా వైఫల్యానికి బాధ్యులెవరు?

**-జనసేన పిఏసి సభ్యుడు డా॥పసుపులేటి హరిప్రసాద్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 8 ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి ఆనంద నిలయాన్ని ఓ వ్యక్తి కెమెరాలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యేలా చేశాడు. ఈ నిఘా వైఫల్యానికి బాధ్యులెవరని జనసేన పిఏసి సభ్యుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ టిటిడి ఉన్నతాధికారులను సూటిగా ప్రశ్నించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఐపిఎస్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రతి ఏటా కోట్ల రూ॥లు వెచ్చించి నిఘా వ్యవస్థను నిర్వహిస్తున్నా, ఇలాంటి వైఫల్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ మధ్యకాలంలో తిరుమలలో డ్రోన్ కెమెరా ఎగురవేసి ఆలయ పరిసరాలను చిత్రీకరించినా పట్టించుకోలేదని, చివరకు భక్తులు ఈ విషయాన్ని బయటపెడితే అప్పుడు టిటిడి దిద్దుబాటు చర్యలకు దిగిందన్నారు. తాజాగా వైసిపి నాయకులు తిరుమలలో స్థానికుల ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' అనే రాజకీయ పార్టీ స్టిక్కర్లను అతికించినా, నిఘా వ్యవస్థ నిద్రావస్థలో ఉందంటే ఏమనుకోవాలన్నారు. తిరుమలలో ఇన్ని జరుగుతున్నా టిటిడి ధర్మకర్తల మండలికి బాధ్యత లేదా? అని నిలదీశారు. మొన్నటి రోజున సులభ్ కార్మికులు జీతాలు పెంచాలని విధులు బహిష్కరించినా, తిరుమలలో నిఘా వ్యవస్థ డొల్లతనం బయట పడుతున్నా ధర్మకర్తల మండలి ఏమాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు.

## అభివృద్ధి పనులకు మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఆమోదం

**మేయర్ శిరీష, కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్ , మే 8 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటి ఆమోదం తెలిపినట్లు తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ శిరీష, కమిషనర్ హరిత, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, నరసింహాచారి, ఉమా అజయ్‌పాల్గొని అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం జరిగింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన ముఖ్య అంశాల్లో మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న అవుట్ డోర్ సిబ్బందిని పర్యవేక్షించడం కోసం వైర్ లెస్ సెట్లను కొనుగోలు చేయలని, 50 డివిజన్‌లో చెత్తను తరలించే వీల్ బారోస్ కొనుగోలు చేయాలని, ఓల్డ్ జ్యోతి థియేటర్ ఐల్యాండ్ వద్ద, అలిపిరి బైపాస్ మీదుగా పాడైపోయిన కల్వర్ట్ స్థానంలో కొత్త కల్వర్ట్ నిర్మించాలని, డివిజన్‌లో గుర్తించిన గుంతలకు సిమెంట్ కాంక్రిట్ వేయాలని, 22వ డివిజన్‌లో రెండు చోట్ల ప్రస్తుతం వున్న రహదారిని 80 అడుగుల రహదారిగా విస్తరించడం, అదే డివిజన్‌లో 80 అడుగుల రోడ్డు వద్ద సెంటర్ మీడియన్ నిర్మాణం, పచ్చదనం అభివృద్ధి, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్ర నాథ్, మునిరామిరెడ్డి, అదనపు కమిషనర్ సునీత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారి కె.ఎల్ వర్మ, సెక్రటరీ రాధిక, ఏపిపిలు బాలసుబ్రమణ్యం , షణ్ముగం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద వెలసియున్న శ్రీ సంపత్ ప్రదీశ్వర స్వామివారికి సోమవారం విశేష అభిషేకాలు, పూజల అనంతరం భక్తులకు దర్శమించారు. ప్రతి సోమవారం భక్తులకు విశేషంగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ప్రభాతవార్త శ్రీకాళహస్తి

# బాధిత వృద్ధుడు, మహిళ కష్టం వినండి!

**పోలీస్ స్టేషన్ మన ఇంటితో సమానం**
**గంజాయి పేరిట తిరుపతి పవిత్రకు భంగం**
**రోడ్డు ప్రమాదాల నివారణ.. చోరీలకు చెక్**
**డిఎస్పీ డాక్టర్ టి.డి.యశ్వంత్**



చంద్రగిరి, మే 8 ప్రభాతవార్త: బాధించబడిన వృద్ధుడు, ఒంటరిగా స్టేషన్‌కు వచ్చే మహిళ కష్టం వినడమే వారికి న్యాయం జరుగుతుందన్న భరోసా కల్పించినట్లు కాగదలని డిఎస్పీ డాక్టర్ టి.డి.యశ్వంత్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని వ్యక్తిగతంగా పరిచయం చేసుకున్న ఆయన నిజమైన బాధితులకు న్యాయం చేయడమంటే వారు చెప్పే కష్టాన్ని పూర్తి వినడమే అన్నారు. వారి కష్టం నిజమైతే తప్పనిసరి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై వుంటుందన్నారు. ఆ విధంగా వ్యవహరించడంలోనే మీ క్రమశిక్షణ, వ్యక్తిత్వం, వ్యవహారశైలి వెలుగుచూడగలదన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి పేరిట మన తిరుపతి పవిత్రకు భంగం కలుగనీయకుండా చూడాల్సిన బాధ్యత మనపై వుందన్నారు. ప్రచారంలో వున్నంతగా క్షేత్ర స్థాయిలో గంజాయి అక్రమ రవాణా లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా భౌగోళిక స్థితిగతుల పట్ల తనకు అవగాహన వుందన్నారు. చిత్తూరు, పుత్తూరు, తిరుపతిలో విధులు నిర్వహించిన తాను 6 మాసాలు మాత్రమే అనంతపురం వెళ్ళివచ్చినట్లు వివరించారు. గంజాయి రవాణాపై స్పష్టమైన సమాచారం వస్తే సంబంధిత ఇన్‌స్పెక్టర్లు చక్కగా స్పందించి నిందితులను రిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో రోడ్డు ప్రమాదాలు, చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రస్తుత చోరీలకు సంబందించిన కేసులను ఒకటి రెండు రోజుల్లో ఛేధిస్తామన్నారు. ఇందు కోసం ఎస్పీ ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరో ఏడాదిలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై నిశిత పరిశీలన, సురక్షిత ఏర్పాట్లపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సంబందించిన పోలీస్ స్టేషన్‌ను మన ఇంటితో సమానంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. సిఐ ఓబులేష్, ఎస్‌ఐలు వంశీధర్, హిమబింధు స్టేషన్‌కు సంబధించిన అంశాలపై వివరించారు.

## 10 నుండి కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు

చంద్రగిరి, మే 8 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 10 నుండి 12 వరకు వార్షిక వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టిటిడి పిఆర్‌ఓ సోమవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 11న సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు స్వర్ణ రథంపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అదేవిధంగా వసంతోత్సవాలను పురస్కరించుకుని రెండు రోజులు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం నిర్వహిస్తారు. మూడవ రోజున శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రుడు, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వేంచేపుగా తీసుకుచ్చి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, ఫలాలును సమర్పించి స్వామి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థమని పురాణాలు వెళ్ళడిస్తున్నాయి.

## సింహ, అశ్వ వాహనాలపై వెంకటేశ్వరస్వామి వారు

సదుం, మే 8 ప్రబాతవార్త: బూరగమందలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహోత్సవాలలో భాగంగా స్వామి వార్లు ఆది,సోమవారాల్లో సింహ, అశ్వ వాహనాలపై విహరించారు. ఉదయం ఆలయంలో తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. స్వామి వారి ఆలయంలో హోమాలు నిర్వహించారు. అనంతరం ఆదివారం రాత్రి స్వామి వార్లు సింహవాహనంపై ఊరేగించారు. సోమవారం అశ్వవాహనంపై గ్రామంలో ఊరేగించారు. మహిళలు ఇళ్ల వద్ద స్వామి వార్లకు కొబ్బరి కాయలుకొట్టి మొక్కులు తీర్చుకున్నారు. చీనేపల్లె రాదిక,జయప్రకాష్‌రెడ్డి, లైన్‌మెన్ మల్లయ్యకుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఈ నెలలో విద్యానగర్‌కు రానున్న ముఖ్యమంత్రి : నేదురుమల్లి



వాకాడు, మే 8 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా దీవెన కార్యక్రమంకు ఈ నెలలో విద్యాసాగర్‌కు రానున్నట్లు రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్, వెంకటగిరి అసెంబ్లీ సమన్వయకర్త తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన వాకాడులోని నేదురుమల్లి రామ్ ప్రసాద్ రెడ్డి నివాసంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెలలోనే గూడూరు కానీ, విద్యానగర్ కానీ ఇంకా కన్ఫర్మేషన్ కాలేదని, రాష్ట్ర కార్యక్రమంను విద్యా దీవెన అయినటువంటి కార్యక్రమంనకు ఆయన హాజరుకానున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుండే ఆయా ఏర్పాట్లు పరిశీలిన చేస్తున్నట్లు రామ్ కుమార్ రెడ్డి అన్నారు.

## అడవి కాలనీలో అగచాట్లు

కోట, మే 8 ప్రభాతవార్త :. కోట మండలం గూడలి పంచాయతీలోని అడవి కాలనీలో అనేక సమస్యలతో ఆ కాలనీవాసులు అగచాట్లు పడుతున్నారు. 2004లో నాటి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి 76 మంది పట్టాలు పంపిణీ చేశారు. ఆ మేరకు నీడ లేని పేదలు కొంతమంది అడవి కాలనీలో పక్కాగృహాలు నిర్మించుకున్నారు. మరికొంతమంది పూరిగుడిసెల్లో నివసిస్తున్నారు. అయితే సక్రమంగా రోడ్డు మార్గం గాని, వీధిలైట్లు గాని, తాగునీటి సరఫరా గాని అందడం లేదని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మంచినీరు నామమాత్రంగా వస్తుందని చెప్తున్నారు. కాలనీలోకి ఆటోలు రావాలంటే రోడ్డు మార్గం సక్రమంగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తమ కాలనీకి అన్ని మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

## పొదుపు సొమ్ము స్వాహాపై విచారణ

కోట, మే 8 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఓ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో రూ.32 వేలు నగదు డిపాజిట్ కాకపోవడంపై వాకాడు మండలం తూపిలిపాలెంకు చెందిన పోలమ్మ, వెంకటమ్మలు సోమవారం కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పుల్లారావు విద్యానగర్‌లోని ఎస్‌బిఐ సమీపంలో సీసీ ఫుటేజిల ఆధారంగా విచారణ చేపట్టారు. బాధితులు తాము రూ.32 వేలు ఆ ప్రైవేటు సర్వీస్ సెంటర్‌లో పొదుపు ఖాతాలకు జమ చేయాలని చెప్తే జమ చేయలేదని ఆరోపించారు. ఇదే విషయమై బాలాజీ అనే మరో సర్వీస్ సెంటర్ వద్దకు వెళ్లి విచారించగా, అది నకిలీ రసీదు అని, అది తాము ఇవ్వలేదని, దానిపైన ఫోర్జరీ స్టాంప్ అని తేల్చినట్లు చెప్పారు. ఆ మేరకు విద్యానగర్‌లో ఉన్న ఓ సర్వీస్‌సెంటర్‌ను జనవరిలోనే తొలగించామని బ్యాంకు అధికారులు తెలిపారు.

## టిటిడికి 10 టన్నుల కూరగాయలు వితరణ



శాంతిపురం, మే 8 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నిర్వహించే నిత్యాన్నదానం కార్యక్రమం కోసం శాంతిపురం జడ్పీటిసి శ్రీనివాసులు, అతని మిత్ర బృందం సోమవారం తమవంతుగా పది టన్నుల కూరగాయలను అందించారు. ఈ సందర్భంగా జడ్పీటిసి శ్రీనివాసులు మాట్లాడుతూ మూడేళ్లుగా ఈ కార్యక్రమంను తాము చేపడుతున్నామన్నారు. అందరికీ మంచి జరగాలని మరలా సిఎంగా జగనన్న ఎన్నిక కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ఎంపిపి వసుంధర కోదండ రెడ్డి, దండపాణి, నిసార్, రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మునేగౌడు, రాజారెడ్డి, లోకనాథరెడ్డి, భాస్కర్, బాబురెడ్డి, వెంకటేష్, చంద్ర, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై చేపలు అమ్మకం

**- తెలుగు యువత వినూత్న నిరసన**



చిత్తూరురూరల్, మే 8 ప్రభాతవార్త: రాష్ట్రంలో వున్న నిరుద్యోగ సమస్యపై తెలుగు యువత సోమవారం వినూత్నంగా నిరసన చేపట్టింది. స్థానిక గాంధీవిగ్రహం కూడలి నందు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ యువతతో కలసి జగన్ ప్రభుత్వం వల్ల మోసపోయిన నిరుద్యోగులమని, మా వద్ద చేపలు కొని మమ్మల్ని అదుకోవాలని రోడ్డుపై వెళుతున్న వారిని ప్రాధేయ పడ్డారు. ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలోని పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయనీ, ప్రతిపక్షంలో వుండగా ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్ అధికారంలోకి వచ్యాక హామీ మరచిపోయారనీ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ క్రమంలో తెలుగు యువత నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

## జక్కదొన మహాభారత ఉత్సవ మూర్తులు ఉప్పరపల్లెలో ఊరేగింపు

వెదురుకుప్పం, మే 8 ప్రభాతవార్త : జక్కదొన మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉప్పరపల్లెలో పంచపాండవులు, ద్రౌపది అమ్మవార్ల విగ్రహాలను ఊరేగించిన్నట్లు ఆలయ ధర్మకర్త మాధవ నాయుడు తెలిపారు. మహాభారత వార్షిక ఉత్సవాలకు ముందుగా విగ్రహాలను భారతం పరిధిలోని గ్రామాల్లో తిప్పడం ఆచారంగా వస్తుందని ఈ క్రమంలోఉప్పరపల్లె గ్రామస్థులు ఘనంగా ఊరేగింపు చేశారు. భక్తులు ఉత్సవ మూర్తులకు కొబ్బరి కాయలు కొట్టి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహాభారత నిర్వహణకు కానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లె గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుపతి గంగమ్మ మహత్యం ఆవిష్కరణ



తిరుపతి,మే 8ప్రభాతవార్త: 11వ శతాబ్ధంకు చెందిన తాతయ్యగుంట గంగమ్మ మహత్యం రంగస్థలి ప్రత్యేక సంచికను కళాకారులు, ఉపాధ్యాయులు సోమవారం ఆవిష్కరించారు. కళాకారుడు స్వర్గీయ కొత్తపల్లి అనంద్ జ్ఞాపకార్థం కళాస్నేహశీలి కొత్తపల్లి మునిరత్నం ఈ సంచికను అంకితమిచ్చారు. ఈ సందర్భంగా రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు కెఎన్ రాజ, పి.జేజిరెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ ఎస్‌కె షరీర్‌బాబ, కొత్తపల్లి శంకరయ్య, డాక్టర్ తేజ, జిఎల్ కుమార్, పగడాల మునిసుబ్రమణ్యం, మునిశేఖర్,కామెడీశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మునిరత్నంను సన్మానించారు.

## కన్నులపండువగా చెన్నకేశవస్వామి పల్లకీసేవ



శ్రీకాళహస్తిరూరల్, మే 8 ప్రభాతవార్త : మండలంలోని ఊరందూరు గ్రామంలో శ్రీకాళహస్తీశ్వరాల యానికి అనుబంధ ఆలయంగా వెలసిన శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం పల్లకీసేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామిఅమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో ఆశీనుల్ని గ్రామోత్సవాన్ని నిర్వహిం చారు. పలువురు భక్తులుస్వామిఅమ్మవార్లను దర్శించుకోవడానికి విచ్చేశారు. కార్యక్రమాలను అధికారులు పర్యవేక్షించారు.

## 2023-24 సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్




తిరుపతిరూరల్, మే 7 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన "జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24"ను సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలన్ని క్యాలెండర్‌లో పొందుపరచడంపై కలెక్టర్ సంతోషాన్ని వెల్లబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఏ నెలలో సంబంధిత అధికారులు లబ్ధిదారులకు అందజేయాలో షెడ్యూల్ వివరిస్తూ క్యాలెండర్‌లో పొందుపరిచారన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్వో శ్రీనివాసరావు, జిల్లా సమాచారశాఖ, పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, డిపిఆర్‌ఓ విజయసింహారెడ్డి, ఎపిఓ వెంకట రమణ, ఎస్టీసిలు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీ లేఖ తదితరులు పాల్గొన్నారు.